క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కేశంపేట: అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్ అన్నారు. ఈ నెల 5 వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఉందని తెలిపారు. రైతులు పాసు బుక్, ఆధార్‌కార్డుతో పాటు నామిని ఆధార్‌కార్డు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సన్మానం



కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి కుమార్‌ను గురువారం గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భూపాలచారి మాట్లాడుతూ.. కుమార్ గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అరవింద్, రామచంద్రయ్య, నర్సింలు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీసులు సాధిస్తాం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



సభ్యత్వ నమోదు చేపడుతున్న గోవర్ధన్‌యాదవ్ తదితరులు

శంకర్‌పల్లి: ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు పాఠశాలల్లో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయించి, పాత పెన్షన్ విధానాన్ని అమలయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రాములు, నాయకులు బాల్‌రాజు, మాణిక్యం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి



మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో గల వన పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటించాలని సూచించారు. కార్యక్రమంలో కారోబార్ శ్రీనివాస్‌గౌడ్, షాబాద్ యాదయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు భరోసా కల్పించాలి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని నిధులను కేటాయించాలని బ్రాహ్మణ సేవా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రవిశర్మ అన్నారు. గురువారం రవిశర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్‌కు రూ.50కోట్ల నిధులను కేటాయించడం హర్షణీయమన్నారు. బ్రాహ్మణ పరిషత్ సంక్షేమానికి రూ.100 కోట్ల ప్రతిపాదనలను పంపించామని, ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌లో కేవలం రూ.50కోట్లను మాత్రమే ప్రవేశపెట్టిందన్నారు. బ్రాహ్మణ సమాజం రూపకల్పనలో ప్రభుత్వం భాగస్వామ్యం కావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బ్రాహ్మణ సమాజంపై చొరవచూపి భరోసా కల్పించాలని కోరారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



చేవెళ్ల: ధర్మసాగర్‌లో బోనాల ఊరేగింపు



షాబాద్: నాగర్‌కుంటలో బోనంతో యువతి

చేవెళ్ల: మండలంలోని ధర్మసాగర్, మల్కాపూర్ గ్రామాల్లో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలందరూ డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు, శివసత్తుల ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. మల్కాపూర్ గ్రామంలో యువకులు బోనాల వేడుకల్లో తొట్టెల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

షాబాద్ మండలంలో..

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి, రేగడిదోస్వాడ, చిన్న సోలీపేట్ గ్రామాల్లో బోనాల ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయం నుంచి భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరి గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అంబరాన్నంటిన సంబరాలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం, అమ్డాపూర్, కాశీంబౌలి, నదీమ్‌నగర్ గ్రామాల్లో బోనాల సంబరాలు గురువారం అంబరాన్నంటాయి. మహిళలు బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలిలో బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో..



చేవెళ్ల: మల్కాపూర్‌లో తొట్టెల ఊరేగింపు

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నరేందర్

షాద్‌నగర్: పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 4, 14 వార్డుల్లో మున్సిపాలిటీ నిధులు రూ.15లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. వర్షాలు కురుస్తుండటంతో ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త సేకరణకు ప్రతీ వార్డుకు మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక వాహనాలను కేటాయించామన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్, బచ్చలి నర్సింహా, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, పాండురంగారెడ్డి, రాములు, జావిద్, అప్సర్, కొండ మల్లేశ్, హరీశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల నిర్వహణపై తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1వ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం వారంరోజులుగా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. దాదాపు లక్ష రూపాయలు ఖర్చుచేసి తనిఖీలు నిర్వహించినా చిన్నపాటి పొరపాట్లు మినహా ఎలాంటి అవకతవకలు బయటికి రాకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా గురువారం చౌదరిగూడలో మండల ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఎస్ఆర్పీ రాఘవులు ఆధ్వర్యంలో డీఆర్పీలు గ్రామాల నివేదికలు చదివి వినిపించారు. గ్రామ పంచాయతీల్లో 7 రకాల రికార్డులు నిర్వహించాల్సి ఉన్నా చాలా గ్రామాల్లో ఈ రికార్డులు నిర్వహించడం లేదని ఎస్ఆర్పీ రాఘవులు వెల్లడించారు. రోజ్‌గార్ దివాస్ కార్యక్రమంలో భాగంగా నెలకొకసారి కూలీలకు సమావేశం నిర్వహించాల్సి ఉన్నా, ఎక్కడ కూడా ఈ సమావేశాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శ్రీలత మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీల డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుహాసిని, అంబుడ్స్ పర్సన్ సునీత, ఏపీడీ చరణ్ గౌతమ్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ హన్మంతురెడ్డి, ఏపీఓ ప్రవళిక పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



షాద్‌నగర్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వెంకట్రామిరెడ్డి తదితరులు



చేవెళ్ల: అల్లవాడలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డికి సన్మానిస్తున్న గ్రామ నాయకులు, యువకులు

షాద్‌నగర్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న పది మంది ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, మాజీసర్పంచ్ శివారెడ్డి, గ్రామస్తులు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవాడ పాఠశాలలో..

చేవెళ్ల: మండలంలోని అల్లవాడ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన కరుణాకర్‌రెడ్డి ఇటీవల బదిలీ కావటంతో ఆయనను పాఠశాల వద్ద గురువారం మాజీ సర్పంచ్ భీమ్‌రెడ్డి, యువకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నాయకులు, యువకులు తదితరులు ఉన్నారు.

షాబాద్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి స్వరూపనర్సింలు పేర్కొన్నారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 9 సంవత్సరాల నుంచి విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు వనజను గురువారం ఉపాధ్యాయులతో కలిసి ఆయన పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు లక్ష్మణ్‌నాయక్, సునీత, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, మాజీ సర్పంచ్ నర్సింలు, ఉపాధ్యాయులు ఖాజాపాషా, లిఖిత, అనురాధ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, కమలమ్మ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



షాబాద్: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ స్వరూప, తదితరులు

తల్లిపాలే బిడ్డకు రక్ష

సీడీపీఓ నాగమణి



కేశంపేట: తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్, జీమ్స్ ఆస్పత్రి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కేశంపేట: తల్లిపాలు పుట్టిన పిల్లలకు రక్ష అని షాద్‌నగర్ సెక్టార్ సీడీపీఓ నాగమణి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గురువారం ఐసీడీఎస్, జీమ్స్ ఆస్పత్రి, కళాశాల, ప్రజ్వల సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు 120 ప్రపంచ దేశాల్లో తల్లిపాల వారోత్సవాలను జరుపుకుంటారన్నారు. పుట్టిన పిల్లలు సక్రమమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జీమ్స్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ రమ్యకృష్ణ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే బిడ్డలు క్షేమంగా పెరుగుతారన్నారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దివ్యషింగ్, శమంతకమని, పంచాయతీ కార్యదర్శి రఘు, టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

వర్గీకరణపై నేతల సంబరాలు



చేవెళ్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

చేవెళ్ల: ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందని ఈ నిర్ణయం చారిత్రాత్మకంగా మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం సాయంత్రం సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణ తీర్పును వెలువడించటంతో సంబరాలు జరుపుకున్నారు. చేవెళ్లలోని అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సంబరాలు చేసుకున్నారు. 30 ఏళ్ల పోరాట ఫలితంగా మందకృష్ణమాదిగ కల కూడా నెరవేరిందన్నారు. మాదిగలకోసం ఆయన ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు జిల్లా కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు యాదయ్య, వెంకటయ్య, మల్లికార్జున్, మహేందర్, సత్యనారాయణ, సంజయ్, కృష్ణ, భిక్షపతి, నర్సింలు, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

కొందుర్గులో..



కొందుర్గులో..

కొందుర్గు: సుప్రంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, చివరకు న్యాయం, ధర్మమే విజయం సాధించిందన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, ఈ కోర్టు తీర్పును అమరులైన వారికి అంకితం చేస్తున్నామన్నారు. వర్గీకరణ పూర్తయ్యే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మానయ్య, నరేందర్, శ్రీను, జంగయ్య, ఆనంద్, నిరంజన్, రమేశ్ పాల్గొన్నారు.

మాదిగల చిరకాల కోరిక..

షాబాద్: మాదిగల చిరకాల కోరిక ఎస్సీ, ఎస్టీ, ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని దళిత సంఘాల నాయకులు తొంట వెంకటయ్య, కృష్ణలు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం షాబాద్‌లో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు జోహార్లు తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు వెంకటేశ్, కృష్ణ, శ్రీను, రాములు, ఇస్తారయ్య, దినకర్ దళిత సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, సీఎం దిష్టిబొమ్మల దహనం



చేవెళ్లలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మొయినాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి



షాబాద్‌లో ధర్నా, రాస్తారోకో

చేవెళ్ల: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని మండల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులందరూ కలిసి ధర్నా నిర్వహించి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా మహిళలకు గౌరవం ఇవ్వాలనే విషయం తెలియకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై పెద్దసంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. చేవెళ్ల పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై వదిలివేశారు. ఈ ధర్నాలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, నియోజకవర్గ నాయకులు దేశమొళ్ల అంజనేయులు, కనీస వేతన బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాంప్రసాద్, కుమార్, ఎల్లయ్య, రాజు, శంకర్, మాదవ్‌రెడ్డి, మానిక్యరెడ్డి, తదితరులు ఉన్నారు.

క్షమాపణలు కోరేవరకు ఆందోళనలు

శంకర్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని శంకర్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం శంకర్‌పల్లి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ప్రభుత్వానికి, సీఎం, డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను శంకర్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ముఖ్యమంత్రి క్షమాపణలు కోరేవరకు ఆందోళనలు చేపడుతామన్నారు. నిరసనలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మన్నె లింగం, అశోక్ ఉన్నారు.

సబితారెడ్డిని విమర్శించే హక్కు లేదు

మొయినాబాద్: మాజీ మంత్రి సబితారెడ్డిని విమర్శించే హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. గురువారం మొయినాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకులు మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. శాసనసభలో చర్చించాల్సిన అంశాలను పక్కనపెట్టి వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ నాయకులు అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు రాంరెడ్డి, పరమేశ్, ప్రవీణ్, మహ్మద్ అలీ ఉన్నారు.

ప్రలోభ పెడితే సహించేదిలేదు

షాబాద్: మహిళలను గౌరవించాలనే సంప్రదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పాటించడం లేదని షాబాద్ మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మండిపడ్డారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తదితర మహిళా ఎమ్మెల్యేలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని ముంబాయి–బెంగళూరు లింకు జాతీయ రహదారిపై అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మిరాజేందర్‌గౌడ్, సహకార సంఘ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పోనమోని కేతన, స్వర్ణలత, యాదమ్మ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్

మొయినాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ అన్నారు. గురువారం ఆయన మొయినాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వర్గీకరణకు మోక్షం లభించబోతోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్లు లభిస్తాయన్నారు.

తీర్పుపై హర్షం

చేవెళ్ల: ఎన్నో ఏళ్ల కల ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పుతో నెరవేరబోతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రావటంపై సంతోషం వ్యక్తం చేశారు. దీనికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిలు రాష్ట్రంలో వర్గీకరణ వెంటనే అమలు చేస్తామని ప్రకటించారన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణను అమలు చేసేలా ఆర్డినెన్స్ తీసుకొస్తామని మాదిగ, ఉపకులాలకు న్యాయం చేస్తామని సీఎం అసెంబ్లీలో వెల్లడించారని చెప్పారు. ఇది ఎంతో సంతోషకరమైన విషయమని చెప్పారు. 60ఏళ్ల వర్గీకరణ కల నేడు తీరబోతుందని ఆనందం వ్యక్తం చేశారు.

రుణపడి ఉంటాం

తరతరాలుగా వెనకబాటుతనాన్ని అనుభవిస్తున్న మాదిగ, ఉపకులాలకు ఈ తీర్పుతో ఎంతో మేలు జరుగుతుందని చేవెళ్ల ఎస్సీ నాయకుడు గంగి యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసేందుకు ఈ వర్గీకరణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.